www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 1 నవంబర్ 2023
5
చిత్తూరు

'బాబు' బెయిల్ సంతోషం : పురంధేశ్వరి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మధ్యంతర బెయిల్ రావడం సంతోషమని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయానికి రాత్రి 7 గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బాబు కేసు విషయాన్ని తప్పు బట్టడం లేదని, అరెస్టు చేసిన విధానాన్ని మొదటినుంచి ఖండిస్తూనే ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా తొలుత శ్రీవారి చెంత తన పర్యటనను ప్రారంభించుకునేందుకు తిరుపతికి వచ్చినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాకు పెద్దపీట వేసిందని, అనేక కేంద్రీయ విద్యాసంస్థలను ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రూ.1800 కోట్లతో ఈ జిల్లాలో జాతీయ రహదారులను చేపట్టిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఏమాత్రం లేదన్నారు. తాము ఇచ్చిన కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లను ఒక్కటి కూడా చేపట్టలేదన్నారు. ఆమెతో పాటు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఉన్నారు.

దిష్టి 'శిలా'ఫలకాలు

- పట్టించుకోని అధికార పాలకులు
- పునాదులకే పరిమితమైన అభివృద్ధి

టిడిపి హయాంలో వేసిన శిలాఫలకం ఐదేళ్లుగా దిష్టిబొమ్మలా...

మండలంలో శిలాఫలకాలు పాలకులను చూసి వెక్కిరిస్తున్నాయి.. గత పాలకులు పోయి నూతన పాలకులు వచ్చి వారి పదవీకాలమూ ముగియనుంది. నేతల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప, నిర్మాణాలు పునాదులు దాటలేదన్న విమర్శలున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన అమరనాథ్‌రెడ్డి మండల నేతల ఒత్తిడి మేరకు మండలానికి విరివిగా పనులు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అప్పట్లో అమల్లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఆ తరువాత రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే గత టిడిపి హయాంలో శంకుస్థాపనలతో తమకు సంబంధం లేదన్న విధంగా నాలుగున్నరేళ్ల పాలన గడిచింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో ఎంఎల్ఏ వెంకటేగౌడ ఆ శంకుస్థాపనల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం, కొత్తగా అభివృద్ధి చేయకపోవడమూ విమర్శలకు తావిస్తోంది. (ప్రజాశక్తి - వి.కోట)

పునాదులు దాటని భవనాలు

ప్రజా అవసరాలు, అన్ని వర్గాల సౌకర్యం కోసం అభివద్ధి పనులకు గత టిడిపి హయాంలో శిలాఫలకాలు వేసి కొన్ని పనులు ప్రారంభించారు. ముఖ్యంగా దళిత వర్గాల పోరాటాల ఫలితంగా అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్థలాన్ని కేటాయించి పనులు ప్రారంభించారు. పునాదుల వరకు పనులు జరిగి అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి. ఈ విషయంగా దళిత సంఘాలు పలుమార్లు నేతలను నిలదీసినా ఫలితం లేక వివిధ కారణాలతో పనులు ఆగిపోయాయి ఈ సంఘటనతో కొంతకాలంగా వివిధ దళిత సంఘాలు పలు సమావేశాలకు జాతీయ నాయకుల జన్మదిన వేడుకలు, వర్ధంతులను జరుపుకునేందుకు స్థలాలు లేక రోడ్లపైనే నిర్వహించుకునే దుస్థితి ఏర్పడింది. అంబేద్కర్ భవనం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది దళితులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలలోని పేద, మధ్యతరగతి మైనార్టీ ల సౌకర్యం కోసం కేటాయించిన షాదీ మహల్ నిర్మాణం పనులు కూడా పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో మైనార్టీలు అధికంగా ఉన్న మండలంలో, పేదల పెళ్లిళ్లు ఇతర కార్యక్రమాల అవసరాల కోసం బయట ప్రాంతాల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు పాలకులు షాది మహల్ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో నేతల తీరుపట్ల మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చేపట్టిన మినీ స్టేడియం పనులు పునాదులకే పరిమితమయ్యాయి. పాలకులు క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని , క్రీడాకారులకు అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానాలు అందుబాటులోకి తీసుకొస్తామన్న హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. మండల రైతులు పండించిన పంటలను ధరలు లేనప్పుడు నిల్వ ఉంచుకుని మంచి ధరలు వచ్చినప్పుడు అమ్ముకునే ఉద్దేశంతో గేస్తింపల్లి సమీపంలో ఐ ఆర్డి ఎఫ్ నిధులు రు.5 కోట్ల అంచనా తో చేపట్టిన శీతల గిడ్డంగి నిర్మాణం పనులు పునాదులకే పరిమితమైంది. పంటల సాగుకు లక్షల రూపాయలు పెట్టుబడును ఎరువులు కూలీల తో అవస్థలు పడుతున్న రైతులు దిగుబడుల సమయంలో ధరలు లేక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. వీటి నుండి బయట పడేందుకు రైతులకు అందివచ్చిన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో మండల పరిధిలోని రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. బీసీలకు పెద్దపీట వేసేది తామే అంటూ పోటీలు పడే అధికార ప్రతిపక్ష పార్టీలు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన బీసీ భవనం నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ నిధులు విడుదల్లో జాప్యం కావడం వల్ల మిగిలిన పనులు గుత్తేదారులు పూర్తి చేయక ప్రారంభానికి నోచుకోలేకపోయింది. వీటితోపాటు గతంలో ఎన్నికలకు ముందు మండలానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. దినదినానికి విద్య పరంగా దూసుకుపోతున్న వీకోట మండలం ఉన్నత చదువులకు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో వేలాది మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేక అర్ధాంతరంగా చదువులకు స్వస్తి చెబుతున్నారు. 15 కోట్ల రూపాయల అంచనాతో మంజూరైన మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో మైనార్టీ బాలికలు ఉన్నత విద్య చదువుకునేందుకు అవకాశం లేక పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు వెయ్యి మంది బాలికలు చదువుకునే లక్ష్యంతో చేపట్టిన ఈ పాఠశాల నిర్మాణ పనులు ఆగిపోవడం పట్ల మైనార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మొక్కులు తీర్చి... టపాసులు పేల్చి..!

బంగారుపాళ్యంలో...

'చంద్రన్న' కు బెయిల్‌తో టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆంక్షలతో కూడిన బెయిల్ మంజురు కావడంతో తెలుగుదేశం నాయకులు జిల్లా పార్టీ కార్యాలయం, జిజేఎం ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ తెలుగుదేశం నాయకులు గురజాల జగన్‌మోహన్‌నాయుడు, గాంధీ విగ్రహం, ముఖ్య నాయకుల నివాసాల వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు నాయుడు నిర్ధోషిగా విడుదల కావాలని, ప్రజల ఆంక్షల మేరకు బెయిల్ వచ్చిందని. త్వరలోనే ఆయనపై పెట్టిన తప్పుడు కేసులు కొట్టివేయబడతాయని తెలుగుదేశం నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పుంగనూరులో...చంద్రబాబుపై ఎన్ని కేసులు నమోదు చేసినా అవి ఆధారాలు లేనివేనని నేతలు సివి రెడ్డి, రామయ్య, ప్రసాద్, నాగరాజు, బాషా అన్నారు. **వెదురుకుప్పంలో..** మండల మాజీ అధ్యక్షులు, వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. నరసింహయాదవ్, పోటుగారి గంగయ్య, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు. **వి.కోటలో..** 'సత్యమేవ జయతే' అంటూ టిడిపి అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్లో బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ర్యాలీ చేయబోగా అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. నగరిలో టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జ్యోతినాయుడు మాట్లాడుతూ ఏ సమయంలో ఎన్నికలు వచ్చినా తాడేపల్లి ప్యాలెస్ పోవుట ఖాయమన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

బంగారుపాళ్యంలో... మండల అధ్యక్షుల్ జయప్రకాష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోక ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్వేటినగరంలో మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్ ఆధ్వర్యంలో గాండ్లమిట్ట కూడలి వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎస్ఆర్‌పురంలో... పుల్లూరు క్రాస్ వద్ద టిడిజి జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

యాదమరిలో తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గంగాధరనెల్లూరులో అంబేద్కర్ విగ్రహం ఎదుట జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి కృష్ణమనాయుడు, మండల అధ్యక్షులు స్వామిదాస్ పాల్గొన్నారు.

చిత్తూరులో...

సప్తగిరి గ్రామీణ బ్యాంకుచే 3కె రన్ వాక్‌థాన్ ర్యాలీ

అవినీతికి వ్యతిరేకంగా...
సప్తగిరి గ్రామీణ బ్యాంకు వాక్‌థాన్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

అవినీతికి వ్యతిరేకంగా కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయ సిబ్బంది, అధికారులు మంగళవారం ఉదయం చిత్తూరు పురవీధుల్లో 3కె రన్ వాకథాన్ నిర్వహించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుండి గ్రీమ్స్ పేట శాఖ వరకు 3కె రన్ వాక్‌థాన్ జరిగింది. బ్యాంకు చైర్మన్ ఎఎస్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వాక్‌థాన్‌లో అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగుల్లో స్ఫూర్తిని నింపారు. రోజువారీ కార్యక్రమాల్లో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేనివిధంగా, ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవినీతిరహిత వ్యవహారం అనేది ప్రతి వ్యక్తీ నిబద్ధతతో ఆచరించాల్సిన విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ ద్వారా అవినీతికి లంచగొండితనానికి దూరంగా ఉన్నట్లయితే సమాజం మొత్తం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. 2024 మార్చి నాటికి 25వేల కోట్ల రూపాయల వ్యాపార లక్ష్యంతో బ్యాంకు నిర్విరామంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ పయనంలో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉమ్మడి కృష్ణా, చిత్తూరు జిల్లాల్లోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ మెరుగైన బ్యాంకింగ్ సదుపాయాలను అందజేస్తున్నామన్నారు. కొత్తగా బ్యాంకు ప్రవేశపెట్టిన దీనదయాల్ బంగారు ఆభరణాల రుణ పథకం ద్వారా వెనుకబడిన తరగతుల ఖాతాదారులకు కేవలం ఆరు శాతం వడ్డీకి రుణం మంజూరు చేస్తున్నామన్నారు. బ్యాంకు విజిలెన్స్ అధికారి రమణయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్; పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ మేనేజర్ ప్రభాహరన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

జీరో నంబర్ ఓట్లను పరిశీలించి చర్యలు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ప్రతి నియోజవర్గంలో జీరో డోర్ నెంబర్ తో నమోదైన ఓట్లను పరిశీలించి డిసెంబర్ 7 లోపు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయం నుండి తుది ఓటర్ల జాబితా సవరణ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సచివాలయం నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డి ఆర్ ఓ ఎన్.రాజశేఖర్ లు వర్చువల్ విధానం లో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఒకే డోర్ నెంబర్ లో 10కి పైగా ఓటర్లు నమోదు అయినట్లైతే వాటిని పరిశీలించి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులపై తగు చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో జేసి లు నిర్వహించాలని, సమాచారాన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలన్నారు. అక్టోబర్ 30 నాటికి జిల్లాలో ఒకే డోర్ నెంబర్ తో 10 మందికి పైగా 842 మంది ఉన్నారని, వీటిని క్షేత్ర స్థాయిలో త్వరితగతిన పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని, తప్పులు లేని తుది ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపడతామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కి వివరించారు.

దేశ ఐక్యతకు పటేల్ కృషి అమోఘం :కలెక్టర్

జిల్లావ్యాప్తంగా 'ఐక్యతా' ర్యాలీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, యంత్రాంగం

దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు అమోఘమని కలెక్టర్ ఎస్. షన్మోహన్ అన్నారు. మంగళవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు పురస్కరించుకుని స్థానిక గాంధీ సర్కిల్ నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు రన్ ఫర్ యూనిటీ (ఐక్యత కొరకు పరుగు) కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పి జెండా ఊపి ప్రారంభించారు. 'భారత్ మాతాకి జై' అను నినాదంతో సాగిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం లో దాదాపు 2 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్. షన్మోహన్ మాట్లాడుతూ రాజుల పాలనలో ఉండే కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలను దేశంలో కలిపేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి సమగ్ర భారతదేశానికి పటేల్ తుది రూపు ఇచ్చారని, సుమారు 550కి పైగా స్వతంత్ర్య రాజ్యాలను భారత్‌లో కలిపి ఐక్య భారత్ నిర్మాణానికి కషి చేశారన్నారు. భిన్న జాతులు, భాషలు, భౌగోళిక పరిస్థితులు ఉన్నా భారత దేశాన్ని సమైక్యంగా ఉంచడానికి పటేల్ ఎంతో కషి చేశారని కొనియాడారు. హోంమంత్రిగా శాంతిభద్రతలను పరిరక్షించి అసలైన లౌకిక దేశాన్ని పునర్నిర్మించారని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బందిలో ఐక్యతాభావం పెంపొందేలా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలచే కలెక్టర్, ఎస్పీ వై. రిషాంత్ రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ లో భాగంగా రన్ ఫర్ యూనిటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్, ఎస్పి

చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్పి ఎస్ఈబి శ్రీలక్ష్మీ, అడిషనల్ ఎస్పీ ఏఆర్ జి.నాగేశ్వర రావు పాల్గొన్నారు. జడ్పిలో జిల్లా పరిషత్ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బంగారుపాళ్యంలో...ప్రభుత్వ జూనియర్, ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పి ఛైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ హరిప్రసాద్‌రెడ్డి, ఎంఇఒ నాగేశ్వరరావు, హెచ్‌ఎం రాధాక్రిష్ణ, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు. **కార్వేటినగరంలో...** డిఎంపురం ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **ఎస్ఆర్ పురంలో...** ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ కృష్ణయ్య, తహశీల్దార్ బెన్నురాజు జయంతి, సర్పంచి హరిత కుప్పయ్య ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. **చౌడేపల్లిలో** ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జడ్‌పిటిసి నడింపల్లి దామోదర్‌రాజు పాల్గొన్నారు. **శాంతిపురంలో...** సచివాలయ ప్రాంగణంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి పూజ చేశారు. సమైక్యత నినాదాలు చేస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మండల కన్వీనర్ దండపాణి, వైస్ ఎంపిపి పట్టాభి, వివేకానంద స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. **యాదమరిలో...** మహిళ ఉపాధ్యాయ నాయకురాలు హిమబిందు(వరిగపల్లె) ,కాంచన,(పెరుమాళ్ళపల్లె)షహనజ్ బేగం(వరిగపల్లె) ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి దేశ భక్తి ని చాటుకున్నారు..అలాగే భారత దేశ మొదటి మహిళ ప్రధాన మంత్రి ఇందిర గాంధి వర్ధంతి సందర్భం ఆమెను స్మరిస్తూ, దేశం కోసం ఆమె చేసిన సేవలు తెలియజేసినారు. **సోమలలో...** ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు టుకే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరనాయుడు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ పాల్గొన్నారు.

4న విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక జాబ్ మేళా

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు జాబ్ మేళాను (ఉద్యోగ శిబిరము) విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యములో నవంబర్ 4 న రాస్ వయోవద్దుల ఆశ్రమ కాంపోండ్ తపోవనం, చిత్తూరు నందు నిర్వహించనున్నామని సంక్షేమ శాఖ సంచాలకులు ఎవై శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 18-30 వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఉచితంగా కృత్రిమ చేతులు

ఎల్లెన్ మెడోస్ టపోస్థటిక్ హ్యాండ్ ఫౌండేషన్ వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారిచే దివ్యాంగులకు కత్రిమ చేతుల కొరకు డిసెంబర్ 10వ తేదీన గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో క్యాంపు నిర్వహించి కత్రిమ చేతులు ఉచితంగా పంపిణి చేయనున్నారు. ఈ కత్రిమ చేతులు అధునాతనమైన, తేలికైన, సులభముగా ధరించగలిగి మీ పనులు చేసుకొనుటకు అనుకూలముగా ఉండును. మో చేయి కింద కనీసము 4 అంగుళముల చేయికల దివ్యాంగులు ఈ కత్రిమ చేతులు పొందుటకు అర్హులు. అంతేగాక రూ.36వేల విలువ చేసే ఈ కత్రిమ చేతులు పూర్తిగా ఉచితంగా పంపిణి చేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయావద్దుల సంక్షేమ శాఖ ఏడి శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు ముందస్తుగా ఈ ఫోన్ నంబరు ద్వారా 7207403150 సంప్రదించి వివరాలను నమోదు చేసుకొనవలసినదిగా కోరారు.

శ్రామికులకు అండ ఎర్రజండా

చిత్తూరుఅర్బన్: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 104వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చిత్తూరు ప్రకాశం హై రోడ్ లో ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర అధ్యక్షతన సభ జరిగింది.సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1920 అక్టోబర్ 31న భారత దేశంలోనే మొట్టమొదటగా ఏర్పడిన సంఘం ఏఐటియుసి అని కొనియాడారు. భారత దేశ స్వతంత్రం కోసం పోరాటంలో పాల్గొనడమే కాకుండా ఆనాడు కార్మికులకు పనిగంటల కోసం, కార్మికుల చట్టాల కోసం హక్కుల కోసం, కార్మికుల సంక్షేమ కోసం రాజీలేని పోరాటాలు చేస్తూ ఏర్పడిన జెండా ఎర్రజెండా అన్నారు. 1920 నుండి నేటి వరకు 2023 వరకు భవిష్యత్తులో కూడా శ్రామికుల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం, సంక్షేమం కోసం, శ్రామికుల పక్షాన అండగా ఉంటున్న జండా ఏఐటియుసి ఎర్రజెండా అన్నారు.

ఎల్‌పిఎం బేస్డ్ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించండి :కలెక్టర్

చిత్తూరుఅర్బన్ : ఎల్ పి ఎం (ల్యాండ్ పార్షియల్ మ్యాపింగ్ మెంబర్) బేస్డ్ రిజిస్ట్రేషన్ ల పై దృష్టి సారించాలనికలెక్టర్ ఎస్. షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలసి రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ పి ఎం సర్వే పూర్తి అయిన గ్రామాలలో ఎల్ పి ఎం బేస్డ్ 22(ఎ) జాబితా అప్ లోడ్ చేయడం జరుగుతుందని, దీని ఆధారంగా 22(ఎ) లిస్ట్ లను సవరించవలసినదిగా సూచించారు. జిల్లాలో రీసర్వేలో మొదటి విడతలో 132 గ్రామాలలో పూర్తి కాగా రెండవ విడతలో 91 గ్రామాలలో పూర్తి అయ్యిందని తెలిపారు. కొత్త సాఫ్ట్ వేర్ ప్రైమ్ 2.0 పని తీరును రిజిస్ట్రార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశం లో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస రావు, చిత్తూరు, చిత్తూరు రూరల్, బంగారుపాలెం, పలమనేరు, కుప్పం, పుంగనూరు, కార్వేటినగరం, నగరి, సబ్ రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు భేష్

ప్రజాశక్తి - రామచంద్రాపురం మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సాగు శభాష్ అని సాధికార సంస్థ రాయలసీమ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సికేపల్లి యూనిట్ పరిధిలోని చిట్టత్తూరు, గొల్లపల్లి, నెత్త కుప్పం గ్రామాలలోని ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ రాయలసీమ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రకతి వ్యవసాయ గ్రామస్థాయి క్యాడర్ వేసిన ఏ గ్రేట్ మోడల్, ఏటీఎం మోడల్స్ , పిఎండిఎస్ పద్ధతులను జిల్లా, మండల, యూనిట్ స్థాయి సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ పద్ధతులలో వ్యవసాయం చేయడం వల్ల రైతులు లాభదాయంగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రామచంద్రపురం మండలం ప్రకృతి వ్యవసాయంలో మోడల్ మండలం గా ఎంపికలో భాగంగా అనంతపురం జిల్లాలో ప్రకతి వ్యవసాయ పద్ధతుల్లో ఏ గ్రేడ్, ఏటీఎం పద్ధతులు చాలా విజయవంతంగా రైతుకు ఆదాయం చేకూరుస్తున్నాయని, ఆ పద్ధతులను మన జిల్లాలో ముఖ్యంగా రామచంద్రపురం మండలంలో ప్రతి ఒక్క కేడరు ఈ పద్ధతులలో ప్రకృతి వ్యవసాయం చేశారని, వీటిని అనుసరించి తిరుపతి జిల్లాలను పూర్తిగా వ్యాపించే దిశగా ఈరోజు వీటిని సందర్శించడం జరిగిందని తెలియజేశారు.

వంట సామాగ్రి పంపిణీ

వంట సామాగ్రి అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రభుత్వ పాఠశాలలు అధికారులు మంగళవారం వంట సామాగ్రిని పంపిణీ చేశారు. ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు సామాగ్రిని అందజేసినట్లు పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా విద్యార్థులు రుచికర ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, రమేష్, హెచ్‌ఎం రాధాకృష్ణ, సిఆర్పి సుశీల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వ్ లెన్స్ టీం పర్యటన

ఆసుపత్రిని పరిశీలిస్తున్న సర్వేలెన్స్ టీం

ప్రజాశక్తి-సోమల: సదుం మండలం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వ్ లెన్స్ టీమ్ పర్యటించింది. చిన్నపిల్లలకు ఇస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై క్షేత్రస్థాయి పర్యటన చేసి పరిశీలించారు. ఇందులో భాగంగా డాక్టర్ మానిక థామస్ నల్ల రాళ్లపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల్లో పర్యటించి టీకాల కార్యక్రమం, పనితీరు, భద్రపరుచు విధానంపై వివరాలు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ గిరీష రెడ్డి, జిల్లా సిబ్బంది రవికుమార్,పర్యవేక్షక సిబ్బంది జానకి, నీలకంఠ, ఆరోగ్య సిబ్బంది నాగరత్నమ్మ, రుక్మిణి, మనీషా, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను మంగళవారం ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ చెకుముకి పోటీలు నవంబర్ 10వ తేదిన పాఠశాల స్థాయిలోను, నవంబర్ 30న మండల స్థాయిలోను, డిసెంబర్ 17న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పుత్తూరు జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ వేణు గోపాల్ మాట్లాడుతూ 2024 జనవరిలో 27, 28 తేదీలో కూడా రాష్ట్ర స్థాయిలో చెకుముకి సంబరాలు జరుగుతాయని తెలిపారు. గత 33 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ చెకుముకి పోటీలు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. వీటి వల్ల సైన్సు పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు శేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, శశికపూర్, మనేంద్ర రెడ్డి, లీలా పలువురు పాల్గొన్నారు.

నెమలిని కాపాడిన రైతులు

దాడి నుంచి రైతులు కాపాడిన నెమలి

ప్రజాశక్తి-చౌడేపల్లి: జాతీయ పక్షి నెమలిని కుక్కల దాడి నుంచి కాపాడి అటవీ శాఖకు అప్పగించారు. మండలంలోని అమన గుట్ట వద్ద మంగళవారం నెమలి గుంపుపై కుక్కలు దాడి చేశాయి. గుర్తించిన రైతులు రాధా, ప్రతాప్‌లు నెమలిని రక్షించారు. అటవీ అధికారులకు సమాచారం అందించి నెమలిని అటవీ అధికారి మునిరాజుకు అందించగా దట్టమైన అటవీ ప్రాంతంలో నెమలిని సురక్షితంగా విడిచిపెట్టారు.

దారి కల్పించాలని వినతి

దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ వాసులు గ్రామంలోని దారి సమస్యపై తహశీల్దార్ అనిల్‌కుమార్‌కు విన్నవించారు. గ్రామస్తులు మాట్లాడుతూ రాగిమాను పెంట రోడ్డు నుంచి అంగన్వాడీ మీదుగా గత 15ఏళ్లుగా ఉండగా, ప్రస్తుతం ఆదారిని మరొకరు ఆక్రమించుకుంటున్నారన్నారు. దాదాపు 150 కుటుంబాలు ఈ మార్గం ద్వారానే వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తహశీల్దార్‌ను కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని తుమ్మగుంటపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేంద్రనాథ్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. విద్యాశాఖ అధికారులు సురేంద్రనాథ్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో నాయకులు మోహన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి, నరేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామాగ్రి వితరణ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జాయినింగ్ ది డాట్స్ ఫౌండేషన్ సహకారంతో క్రీడా సామాగ్రిని స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పిడి సెల్వాంబిదయకు అందజేశారు. పిడి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు దాత ముందుకు వచ్చి రూ.లక్ష విలువ చేసే క్రీడా కిట్లను అందజేశారన్నారు. దాతల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, వైస్ ఎంపిపి హరిబాబు, ఈవోఆర్డి రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.6కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

- కౌన్సిలర్లు ప్రత్యేక చొరవ చూపాలి
- మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలో రూ.6 కోట్ల మేర అభివృద్ధి పనులు జరగనున్నాయని మున్సిపల్ చైర్మన్ నీలమేఘం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామి రెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. సమావేశంలో విప్ దయానిధి మాట్లాడుతూ జగన్న కాలనీలో ఇంకా ఇల్లు నిర్మించుకోని లబ్ధిదారుల వివరాలు తెలపాలన్నారు. వారిలో ఆశక్తి లేనివారిని తప్పించి ఇతర లబ్ధిదారులకు అవకాశమివ్వాలన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేపట్టవలసిన కొన్ని అభివృద్ధి పనులకు చైర్మన్ దృష్టికి తెచ్చారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లోను ప్రాధాన్యతానుసారం ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళుతున్నామన్నారు. ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వాటర్ సప్లై కాంపొనెంట్‌కు గాను టైడ్ గ్రాంటులో రూ.1.20 కోట్లు మంజూరైందని వాటికి సంబంధిత ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కాలువలు, రోడ్ల నిర్మాణాలకు 132 పనులకు రూ.5 కోట్లు మంజూరైందని రూ.2.20 కోట్ల వ్యయంతో చేపట్టే 70 పనులకు టెండరు కూడా పూర్తయిందన్నారు. రూ.2.66 కోట్ల మేర చేపట్టే 62 పనులకు షార్ట్ టర్మ్ టెండరు పిలవడం జరిగిందన్నారు. ఇదిగాక గడపగడపకు నిధుల ద్వారా వార్డుకు 20 లక్షల చొప్పున అభివద్ధికి వెచ్చించడం జరుగుతుందన్నారు. గుడ్‌విల్ పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామన్నారు. ఇలా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

వి.కోట : కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. స్థానిక 46వ వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ అముద, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు రెడ్డప్ప, జ్ఞాన జగదీష్, కో ఆప్షన్ మెంబర్ కోలా కిరణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా. లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని నేర్నిపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పేద ఆరోగ్య రక్షణ కోసం సీఎం చొరవ తీసుకొని గ్రామాల్లోనే వైద్య సదుపాయాలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి యువరాజ్, ఎంపిడివో మహ్మద్ రఫి, వైస్ ఎంపిపి తమీంఖాన్, ఎంపీటీసీ యశోదమ్మ, కో ఆప్షన్ సభ్యులు జేబీవుల్ల, తహశీల్దార్ చిట్టిబాబు, వైద్యులు విజయకాంత్, భరత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీ సిద్ధేశ్వరకొండలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపిపి అనిత, తహశీల్దార్ ఇన్బనాథన్, వింజం సర్పంచ్ రామక్కగోవిందయ్య, ఉప సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపిటిసి అనీఫ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా పాల్గొన్నారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ దత్తురెడ్డి, ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దార్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి ఉష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని గుంజార్లపల్లి పంచాయతీలో మంగళవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పిటిసి శ్రీనివాసులు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమమాలిని, వైస్ ఎంపీపీ పట్టాభి, వైసిపి పార్టీ కన్వీనర్ దండపాని, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పారిశుద్ధ్య కార్మికులను స్థానిక సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యర్థాలను తొలగించి ప్రజల ఆరోగ్యం కాపాడటానికి వారు చేస్తున్న కష్టం ఎనలేనిదని కొనియాడారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ ప్రజారోగ్యానికి వారు చేస్తున్న కృషి హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, జెడ్పి మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మండల కో ఆప్షన్ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, ఎంపిటిసి ఉష, ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘ నేతలు కోరారు. ఎంపీడీవో కార్యాలయం నందు మంగళవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తహశీల్దార్ మురళి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, కన్వీనర్ బాబురెడ్డి, ఎంపీడీవో శివశంకర్, సీఐ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దళితుల పట్ల వివక్ష దళితుల స్మశాన వాటికల ఏర్పాటుపై నిర్లక్ష్యం వీడలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ స్థలాన్ని సంరక్షించలన్నారు. ముఖ్యంగా మిట్టపల్లి దళితులకు స్మశాన వాటిక ఏర్పాటు, ఎస్సీ హాస్టల్ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారంటూ మండల ప్రజా ప్రతినిధులకు దళిత సంఘాల నాయకులు తెలియజేసారు. వెంటనే స్పందించిన అధికారులు, నాయకులు వాటిపై చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన బాస్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర సతీష్, పెన్వెల్ సింహ, నవీన్ ,ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్, రవి బాబు, రంగప్ప ,దళిత సమైక్య నాయకులు రమణ, చంద్రశేఖర్, తులసి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

యదమరిలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-యదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను అధికారులు నేరుగా తెలుసుకుని సమస్య పరిష్కరించడం కోసమే పౌర హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తహశీల్దార్ హనుమంతు అన్నారు. మంగళవారం మాదిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఎంవివై కాలనీ నందు పౌర హక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం కు పోలీసు ,రెవెన్యూ, అభివద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి అధికారి శివరాజ్, దళిత నాయకులు మురుగేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతినగర్ రామాలయం వద్ద పౌర హక్కుల దినోత్సవం రెవెన్యూ, పంచాయతీ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ పౌర హక్కులను ప్రతి ఒక్కరు తెలుసుకొని తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులు తమకు వ్యవసాయం చేసుకునేందుకు అనువైన భూమిని అందజేయాలని అదేవిధంగా చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను సకాలంలో అందజేయాలని కోరారు. స్పందించిన డిటి రామమూర్తి మాట్లాడుతూ అర్హులైన వారిని గుర్తించి భూ పంపిణీ సందర్భంగా భూమిలేని నిరుపేదలకు తప్పకుండా భూ పంపిణీలో భూములను పంపిణీ చేయడం జరుగుతుందని, నిత్యావసర సరుకులను కూడా ఎప్పటికప్పుడు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి మేనక, వాలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీ నందు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఏఎస్ఐ వెంకట నరసింహులు రెవెన్యూ అధికారి రమణ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సమాచార హక్కు చట్టం సైబర్ నారగల్లు గ్రామంలో సంస్థ ఎలా పరిష్కరించుకోవాలి అంశాలపై అధికారులు గ్రామ ప్రజలకు తెలియపరిచారు.

రక్తదానంతో ప్రాణదానం చేయండి : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్ : రక్తదానంతో ప్రాణదానం చేయాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఆచార్య భారతి పేర్కొన్నారు. మహిళా యూనివర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రుయా బ్లడ్ బ్యాంక్, తిరుపతి సెంట్రల్ టాక్స్ విభాగం, హెచ్డిఎఫ్సి బ్యాంక్ సహకారంతో మంగళవారం ఆరోగ్య కేంద్రం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆపదలో ఉన్నవారిని రక్తదానం చేసి ఆదుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని చెప్పారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రజిని మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తినాలని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు.

హామీలు నెరవేర్చాం.. ఆదరించండి

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వి.కోట: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని ప్రభుత్వాన్ని ఆదరించాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మంగళవారం మండలంలోని జవనపల్లి గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం సంక్షేమ పథకాల అమలపై అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. వి.కోట ప్రధాన రహదారి నుండి జవనపల్లికి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించినందుకు ఆ గ్రమస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు, ఎంపిపి యువరాజ్, వైస్ ఎంపిపిలు లక్ష్మణరెడ్డి, తమీంఖాన్, సర్పంచ్ భారతమ్మ, మాజీ సర్పంచ్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వి.కోట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నవంబర్ 3వ తేదీన నిర్వహించబోయే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పలమనేరులోని పద్మావతి మహిళా కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరుగుతుందన్నారు. మేళాకు సంబంధించి పోస్టర్లను మంగళవారం వి.కోటలో వారు ఆవిష్కరించారు. పేరుగాంచిన కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధ్యాపకుడికి సత్కారం

జ్ఞానశేఖర్ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆర్‌కెఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం అధ్యాపకులు జ్ఞానశేఖర్ సేవలు ఎనలేనివని కళాశాల ప్రిన్సిపల్ స్వరూప అన్నారు. మంగళవారం కళాశాలలో పదవీవిరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ 34 ఏళ్లుగా జ్ఞానశేఖర్ కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందించారన్నారు. ఆయన బోధనా శైలిని కొనియాడారు. జ్ఞానశేఖర్‌ను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కమలాకర్‌రెడ్డి, ఆద్యాపకులు సుబ్బారావు, కిషోర్కుమార్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి

పల్లె నిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: నేరాలు నియంత్రించడంలో పోలీసులకు ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎస్ఐ వెంకటనరసింహులు అన్నారు. మంగళవారం కందూరులో పల్లె నిద్ర చేపట్టారు. స్థానిక సచివాలయంలో ప్రజలతో సమావేశం నిర్వహించి పోలీసు విధులు, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి భాషామసూద్, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్బరీ సాగులో అధిక దిగుబడులు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మల్బరీ సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించి, లాభాలు పొందవచ్చని జిల్లా సెరికల్చర్ డైరెక్టర్ మైనార్టీ మోహన్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని తయ్యూరు రైతు భరోసా కేంద్రంలో ఏపి పట్టు పరిశ్రమ శాఖ రాష్ట్రీయ కషి వికాస్ యోజన పథకం ద్వారా వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు పట్టు పరిశ్రమ నాటి సాగు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సెక్టార్ అసిస్టెంట్ డైరెక్టర్ మేనాటి మోహన్ బాబు మాట్లాడుతూ మల్బరీ సాగు చేయడం ద్వారా ఎకరానికి ఒక సంవత్సరానికి 5 పంటలు సాగు చేయవచ్చు. అని దాదాపు రెండు లక్షల వరకు ఆదాయం పొందవచ్చు అని అన్నారు. ప్రభుత్వం మార్కెట్ ధర కేజీ 450 నుంచి 500 వరకు ఉందని మిగతా పంటలతో పోల్చుకుంటే మల్బరీ సాగు చేయడం పట్టు పురుగులు పెంచడం సులువైన పంటని తక్కువ నీటితో ఎక్కువ పంటను పండించవచ్చు అని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సరిత, సర్పంచ్ వరదమ్మ, ఉమామహేశ్వరి నాయకులు జనార్ధన్, మణి, బాబు, ఆనంద్, తంబి, పంచాయితీ కార్యదర్శి జ్యోష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ 14వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-నగరి: ఏఐటీయూసీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం నగరిలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, టవర్‌క్లాక్ సెంటర్, సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేసి ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటిసారిగా ఏర్పడి ఇప్పటి వరకు కార్మికులకోసం పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీ అన్నారు. కార్మికవర్గాన్ని సంఘటిత పరిచి ఎనిమిది గంటల పని విధానం, బోనసు, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను గ్రాజువిటీ, పని భద్రత అనేక కార్మిక సంక్షేమాలను సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు వేలన్, నాయకులు భాషా, మురళి, శేఖర్, మున్సిపల్, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి బస్సు యాత్ర..

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వైసిపి చేపట్టిన సామాజిక సాధికర బస్సు యాత్ర సందర్భంగా నవంబర్ 2న చిత్తూరు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఎస్పి రిశాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఆంక్షలపై పలు సూచనలు చేశారు. గుడిపాల నుంచి వచ్చే వాహనాలు కణ్ణన్ కళాశాల వద్ద, యాదమరి వైపు నుంచి వచ్చే వాహనాలు రెడ్డిగుంట వైపు వచ్చి ఎంఎస్‌ఆర్ దగ్గర, కొంగారెడ్డిపల్లి మార్గంలోని ఉడుపి హోటల్ పక్కన ఉన్న మున్సిపల్ బస్‌స్టాండు దగ్గర ఉన్న పార్కింగ్ చేయాలని సూచించారు. అలానే భాస్కర హోటల్ పక్కన ఉన్న లక్ష్మి నగర్ కాలనీలో ఉన్న బిటి కాంపౌండ్ నందు పార్కింగ్ చేయాలి. అలానే గంగాధర నెల్లూరు వైపు నుండి వచ్చే వాహనాలు ఎంఎస్‌ఆర్ సర్కిల్ దగ్గర నుండి నేరుగా పివికెఎన్ డిగ్రీ కళాశాల దగ్గర వాహనాలను పార్కింగ్ చేయవలసి ఉంటుంది. మిగిలిన వాహనాలను పిసిఆర్ ప్రభుత్వ కళాశాల లో పార్కింగ్ చేయవలసి ఉంటుంది. సాధారణ వాహనాలు నగరంలోనికి ప్రవేశించకుండా రెడ్డిగుంట నుండి వచ్చే వాహనాలు పివికెఎన్–ఫారెస్ట్ రూట్ మీదుగా కొంగారెడ్డి పల్లి వైపు, వరిగపల్లి నుండి వచ్చే వాహనాలు దర్గా నుండి డిపో వైపు, సాంబయ్య కండ్రిగ నుండి వచ్చే వాహనాలు కట్టమంచి వైపు వెళ్లాల్సిందిగా కోరారు.

రెగ్యులరైజేషన్ జాబితా విడుదల చేయకుంటే ఆందోళన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయులకు సర్వీస్ రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ చిత్తూరు జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఎస్టీయూ అసోసియేషన్ అధ్యక్షులు గంటా మోహన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తంలతో కలసి, ఎస్‌టియు చిత్తూరు జిల్లాశాఖ అధ్యక్షులు దేవరాజులు రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మదన్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు జయరామప్ప తదితరులు మంగళవారం సాయంత్రం చిత్తూరులో డిఇఓ విజయేంద్రరావును కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం పలు అంశాలపై డిఇఓతో చర్చిస్తూ, టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాలు విడుదల చేయకపోవడం వల్ల పదోన్నతులు, బదిలీల సందర్భంగా అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నవంబర్ ఆఖరిలోపు ఈ జాబితాల విడుదలకు చర్యలు తీసుకోకపోతే తాము ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. పదోన్నతి పొందిన వారిలో కొద్ది మంది టీచర్లు అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో పదోన్నతి రద్దు చేసుకొని పాత పోస్టుకు వెళతామని దరఖాస్తు చేసుకున్నప్పటికి, నాలుగు నెలలుగా జాప్యం చేస్తుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీల పేరుతో, వివిధ కార్యక్రమాల పేరుతో టీచర్లను ఒత్తిడికి గురి చేసే విధానాలను తగ్గించాలని, టీచర్ల సంక్షేమం పట్ల దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. డిఇఓ విజయేంద్రరావు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో సత్వర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు మధుబాబు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వికోట: స్థానిక నారాయణ నగర్‌లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్ర కృష్ణగిరికి చెందిన గోవిందరాజు(39) వి.కోటలో ఓ బేకరిలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం పనులు ముగించుకొని తన గదికి వెళ్లి ఉరేసుకొని వేలాడుతూ కనించాడు. గుర్తించి అక్కడి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చోరీ కేసులో నిందితునికి జైలు శిక్ష

ప్రజాశక్తి-పుంగనూరు: మోటార్ సైకిల్ వాహనాలు చోరీ కేసుల్లో నిందితునికి ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు సీఐ రాఘవరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం రాయలపేట గ్రామానికి చెందిన గంగులప్ప కుమారుడు దాసరి రాము(20) ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. ఇతన్ని వాహనాలు చోరీ కేసులో ఈ ఏడాది ఎస్పి మోహన్ పుంగనూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణ సందర్భంగా మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో వాదోపవాదనలు విన్న తర్వాత ముద్దాయి నేరం చేశాడని రుజువు అయినందున అతనికి కోర్టు సెక్షన్ 248(2) సి ఆర్ పి స మేరకు 6 నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు. పిర్యాధి తరపున గవర్నమెంట్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ వాదనలు వినిపించినారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి-యాదమరి: కోనాపల్లి పాఠశాల హెచ్‌ఎం బదలీపై వెళ్ళిన రవీంద్ర రెడ్డి మిత్రబందం రాంనగర్ కాలనీ చెందిన బేబి దేవకి, సత్య నారాయణ కోణాపల్లె ప్రాధమికోన్నత పాఠశాలకి రూ. ప్రింటర్‌ని వితరణ చేశారు. మంగళవారం రూ.16వేలు విలువైన ప్రింటర్‌ని అందజేసినట్లు పాఠశాల హెచ్.యం.విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రుక్మణిమ్మ, హెచ్.ఎల్.ఎన్.ప్రసాద్, హెచ్ .యం. రవీంద్రరెడ్డి, రిటైడ్ హెచ్.యం.భారతి, రమణి,జ్యోతి పాల్గొన్నారు. అనంతరం దాతకు కృతఘ్నతలు తెలిపారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు అభిషేకాలు చేసి అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కార్యకర్త మృతికి నివాళులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని గొరివిరుమాకులపల్లి పంచాయతీ పెద్ద గెరిగపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువనేత రెడ్డెప్పరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంగళవారం మండల టిడిపి నేతలు రెడ్డెప్పరెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అదేవిధంగా మనెంద్రం పంచాయతీ అత్తికుప్పంకు చెందిన మేస్త్రి చంద్రప్ప అనే కార్యకర్త మరణించాడు. దీంతో అతని కుటుంబానికి టిడిపి నాయకులు రూ.పది వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. సంతాపం తెలిపిన వారిలో మునస్వామి, నరసింహులు, రామమూర్తి, శ్రీరాములు రెడ్డి, చంద్రశేఖర్, విశ్వనాథ్, రామలింగారెడ్డి, ఆదిల్, వెంకటరమణ ఉన్నారు.

చుడా చైర్మన్ పదవీకాలం పొడిగింపు

ప్రజాశక్తి-చిత్తూరు: అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డిని వదవీకాలం పొడిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 2వ తేదీతో పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి మరో ఏడాది కాలం పాటు పురుషోత్తంరెడ్డినే కొనసాగిస్తూ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఘనంగా మాజీ ప్రధాని వర్ధంతి

ప్రజాశక్తి-పుంగనూరు: భారతరత్న, దేశభక్తురాలు, భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు షేక్ సర్దార్ బాషా అన్నారు. మంగళవారం 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇందిరాసర్కిల్ నందు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక పథకాలు తెచ్చిన ఘనత వారి అభివృద్ధికి కృషి చేసిన ఘనత ఇందిరాగాంధీది అని పేర్కొన్నారు.

నగరి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్.బాబు అన్నారు. మంగళవారం భారత దేశ మొదటి మహిళ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని టవర్ క్లాక్ సెంటర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. బస్టాండు ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, నాయకులు డిల్లి, కుమార్, నాగేశ్వరరావ్, గుణా తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No. 648 of 2022
O.S.No.635 of 2022

Between:
P.Ramaswamy Naidu...Peitioner/Plaintiff
And:
P.Bujjamma and others
...Respondents/Defendants

NOTICE TO 1st to 3rd RESPONDENTS

TO
R1.P.BUJJAMMA,
W/o Late P.Munaswamy @ P.Mohan Chowdary
R2.P.BALAJI NAIDU,
S/o Late P.Munaswamy @ P.Mohan Chowdary,
R3.P.BUJJI@ P.ANITHA,W/o not Known,
D/o Late P.Munaswamy @P.Mohan Chowdary
All are residing at Jettigundlapalle Village, Ugranampalli Post, Penumur Mandal, Chittoor District

Madam, It is hereby brought to your notice that the above named Petitioner/plaintiff filed a above suti for your appearance of on **09-11-2023.** So that you are hereby ordered to appear before the court on **09-11-2023 at about 10.30 A.M** either in person or through pleader and answer the said petition, failing which the matter will be heard and determined in your absence.
(B.O)

Sd/-C.K.RAGHU
Advocate for Petitioner